క్లుప్తంగా

ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన జేసీ



మిడ్జిల్: స్థానిక ఎన్నికల్లో ఇబ్బంది లేకుండా చూసుకోవాలని జాయింట్ కలెక్టర్ మధుసూధన్‌నాయక్ సూచించారు. ఎన్నికల నిర్వహణపై బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ యూపి రాజు, ఎంపీడీఓ గీతాంజలి, ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడుతో సమీక్ష నిర్వహించారు. అనంతరం భూ భారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారాల గురించి తెలుసుకున్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించాలని సూచించారు.

కాంగ్రెస్ ప్రజలను మోసం చేసింది



చిన్నచింతకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం చిన్నచింతకుంట మండలంలోని పెద్ద వడ్డెమాన్‌లో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల బాకీ కార్డులను ప్రజలకు అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలు ఇచ్చి నెరవేర్చలేదని ప్రజలకు వివరించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చే స్థానికి సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు.

గ్రంథాలయ కమిటీ నియామకం

జడ్చర్ల టౌన్: బాదేపల్లి గ్రంథాయలం అభివృద్ధి కమిటీ సభ్యులను నియమించినట్లు అధ్యక్షుడు అయ్యన్న తెలిపారు. బుధవారం గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యక్షుడుగా సలీం, ప్రధాన కార్యదర్శి ఉమ్మెంతల మహేశ్వర్, సహాయ కార్యదర్శి రాఘువేందర్, కోశాధికారి దుర్గం రాము, సభ్యులుగా వెంకటేశ్‌గౌడ్, సుంకసారి బుచ్చిలింగం, లక్ష్మణ్ గౌడ్, చంద్రశేఖర్, లక్ష్మయ్య యాదవ్‌లను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యుల నియామకం గూర్చి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి సమాచారం అందించినట్లు అధ్యక్షుడు అయ్యన్న తెలిపారు. గ్రంథాలయం అభివృద్ధికి పూర్తిస్థాయిలో తమ కార్యవర్గం కృషి చేస్తుందని ప్రకటించారు.

మండల వ్యవసాయాధికారిగా రాధమ్మ

గండేడ్: మండల వ్యవసాయాధికారిగా రాధమ్మ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఉన్న వ్యవసాయాధికారి రాంపాల్ పదోన్నతిపై వెళ్లడంతో ఇన్‌చార్జి బాధ్యతలు మహమ్మదాబాద్ వ్యవసాయాధికారి నరేందర్‌కు అప్పగించారు. అప్పటి నుంచి ఆయనే గండేడ్ మండల వ్యవహారాలు చూసేవారు. యాచారం మండలంలో ఏఈఓగా పని చేస్తున్న రాధమ్మ వ్యవసాయాధికారిగా పదోన్నతి పొంది మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈమేరకు ఆమెను గండేడ్ వ్యవసాయాధికారిగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆమె గండేడ్ వ్యవసాయాధికారిగా విధుల్లో చేరారు.

దాతల సహకారంతో రేకుల షెడ్డు ఏర్పాటు



చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపూర్ కురుమూర్తి స్వామి ఆలయం వద్ద దిగుడు మెట్లపై దాతల సహకారంతో రేకులషెడ్డును ఏర్పాటు చేస్తున్నారు. దిగుడు మెట్లపై భక్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆలయ సిబ్బంది భక్తుల దృష్టికి తీసుకరాగా అందుకు పలువురు భక్తులు ముందుకొచ్చారు. రూ.6 లక్షలతో 200 ఫీట్ల పొడువు షెడ్డు నిర్మాణం చేపడుతున్నారు.

జయప్రకాష్ నారాయణకు ఘన నివాళి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేపీఎన్‌సీ కళాశాలలో జయప్రకాష్ నారాయణ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన విగ్రహానికి కళాశాల చైర్మన్ రవికుమార్ పూలదండ వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయప్రకాష్ నారాయణ ప్రధాని పదవిని సైతం కాదని, విలువల కోసం జీవించాడని, గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడని, శాంతియుతంగా నిరసన తెలిపి న్యాయాన్ని సాధించాలని సమాజానికి సూచించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో స్తంభించిన ట్రాఫిక్

- న్యూటౌన్‌లో గంటల కొద్ది ఏర్పడిన ట్రాఫిక్ సమస్య
- అవస్థలు పడిన వాహనదారులు
- ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన అంబులెన్స్



న్యూటౌన్‌లో నిలిచిన వాహనాలు



రోడ్డుపై మరమ్మతు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ అంటే సాధారణంగా నిత్యం వాహనాలతో, వ్యాపార సముదాయాలతో రద్దీగా ఉంటుంది. అలాంటి ప్రాంతంలో రోడ్డుపై ఒక వాహనం ఆగిపోతే ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఇలాంటి సమయంలో రోడ్డు మధ్యలో మరమ్మతుకు శ్రీకారం చూడితే ఎలా ఉంటుంది. న్యూటౌన్ చౌరస్తాలోని జడ్చర్ల–మహబూబ్‌నగర్ 167జాతీయ రహదారిపై అతిపెద్ద మంచినీటి పైపులైన్ లీకేజీ కావడంతో మరమ్మతు పనులకు బుధవారం ఉదయం మున్సిపల్ సిబ్బంది పనులు ప్రారంభించారు. దీంతో బస్టాండ్ నుంచి మెట్టుగడ్డ వైపు వెళ్లాల్సిన వాహనదారులు ట్రాఫిక్ జాంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన రోడ్లపై ఇలాంటి మరమ్మతులు రాత్రి వేళ ట్రాఫిక్ లేని సందర్భాల్లో చేస్తే వాహనదారులకు ఇబ్బందులు ఉండవు. మున్సిపల్ అధికారులు ఉదయం వేళ చేయడం వల్ల షాషాబ్‌గుట్ట చౌరస్తా నుంచి సుభాష్ చంద్రబోస్ చౌరస్తా వరకు వాహనాలు నిలిచాయి. కొంత సమయం ట్రాఫిక్ కానిస్టేబుల్స్ కన్పించినా ఆ తర్వాత అక్కడ ఎవరూ లేకపోవడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ట్రాఫిక్ అత్యవసరంగా వెళ్లాల్సిన అంబులెన్స్‌లు సైతం ఇరుక్కుపోయి ఇబ్బందులు పడిన దృశ్యాలు కన్పించాయి.

హనుమాన్‌నగర్‌లో దాహం దాహం



హనుమాన్‌నగర్‌లో రైల్వే ట్రాక్ పక్కన పైపులైన్‌ను తొలగించి అలాగే వదిలేసిన తీరు



హనుమాన్‌నగర్‌లో అవసరం లేని చోట ఏర్పాటు చేసిన నీళ్ల కుళాయిలు

- రైల్వే ట్రాక్ విస్తరణతో పైపులైన్ తొలగింపు
- పట్టించుకోని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో డబుల్ లైన్ కోసం కొన్ని నెలలుగా రైల్వే ట్రాక్‌ను విస్తరిస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక హనుమాన్‌నగర్ పక్క నుంచి ఈ పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ ప్రాంతంలో సుమారు నాలుగు నెలల క్రితం మిషన్ భగీరథ పైపులైన్‌ను రెండు చోట్ల తొలగించి వదిలేశారు. అప్పటి నుంచి అక్కడ సుమారు 25 ఇళ్లకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా కుటుంబాల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలంటూ గత ఆగస్టు 26న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అయినా ఇంతవరకు ఇంజినీరింగ్ అధికారులు అక్కడికి వెళ్లి పరిస్థితిని పరిశీలించలేదు. మరోవైపు పక్క గల్లీలో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా ఇటీవల రెండు పబ్లిక్ ట్యాప్‌లు ఏర్పాటు చేయడం గమనార్హం. సమస్య ఒకచోట ఉంటే మరోచోట వీటిని బిగించడంలో ఆంతర్యమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పక్క వీధిలో నుంచి మిషన్ భగీరథ పైపులైన్‌ను కనీసం 15 ఫీట్లు పొడిగిస్తేనే ఈ సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ వసంతను వివరణ కోరగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

కానిస్టేబుల్‌ను అభినందించిన ఎస్పీ



మహబూబ్‌నగర్ క్రైం: హర్యానా రాష్ట్రంలో సెప్టెంబర్ 20నుంచి 24వరకు జరిగిన 74వ ఆల్ ఇండియా పోలీస్ రెజ్లింగ్ క్లస్టర్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన అడ్డాకుల పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్ రాధికను బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ డి.జానకి అభినందించారు. శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ పోలీస్ శాఖలో మహిళా సిబ్బంది క్రీడా రంగాల్లో ప్రతిభ చాటడం గర్వకారణమన్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

నవాబుపేట: స్థానిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు గురువారం నుంచి స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్‌లు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ జెడ్పీటీసీ స్థానానికి సంబంధించిన నామినేషన్లు మండల కేంద్రంలో స్వీకరిస్తామని తెలిపారు. క్లస్టర్ల వారీగా ఎంపీటీసీల నామినేషన్లు ఆయా గ్రామాల్లో స్వీకరణ ఉంటుందన్నారు. ఎంపీటీసీల నామినేషన్లకు సంబంధించి మండల కేంద్రంలో నవాబుపేటతో పాటు చౌడూర్, గురుకుంట ఎంపీటీసీ స్థానాల నామినేషన్లు స్వీకరిస్తారు. కొల్లూర్‌లో కొల్లూర్, పోమాల్, కామారం, యన్మన్‌గండ్లలో యన్మన్‌గండ్ల, కొండాపూర్, కాకర్లపహడ్, కారుకొండలో తీగలపల్లి, కారుకొండ, కూచూర్, లోకిరేవులో ఇప్పటూర్, లోకిరేవు, కిషన్‌గూడ ఎంపీటీసీల నామినేషన్లు అధికారులు స్వీకరిస్తారని, దీన్ని అందరు గమనించాలని సూచించారు.

ప్రశాంత జీవనం కోసం ధ్యానం చేయాలి



బస్వాయపల్లిలో మాట్లాడుతున్న శుద్ధ చైతన్యానంద స్వామి

దేవరకద్ర: ప్రశాంతమైన జీవనం కోసం ధ్యానం చేయాలని ప్రకాశం జిల్లా పిరమిడ్ ధ్యాన కేంద్రం ప్రముఖులు శుద్ధ చైతన్యానంద స్వామి సూచించారు. బుధవారం దేవరకద్ర మండలం బస్వాయపల్లిలో పిరమిడ్ సైలెంట్ వ్యాలీ కేంద్రాన్ని ఆయన సందర్శించి ధ్యానులకు సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ధ్యానం, మౌనం, ప్రకృతి విశిష్టత గురించి వారికి వివరించారు. అందరు ధ్యానం చేయాలని ఆత్మజ్ఞానం వైపు నడవాలని కోరారు. కార్యక్రమంలో సైలెంట్ వ్యాలీ వ్యవస్థాపకులు పకృతి ఉమామహేశ్, నిర్వాహకులు పిరమిడ్ పారిజాత, ఖదీర్, త్రివేణి పకృతి టీం సభ్యులు జిల్లాలోని వివిధ ప్రాంతాల ధ్యాన ప్రముఖులు పాల్గొన్నారు.

గెలిచే వారినే ఎంపిక చేయండి

గండేడ్: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందే అభ్యర్థులను ఎంపిక చేయాలని బీజేపీ ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచుల ఎన్నికల్లో ప్రజల్లో ఉండి ప్రజాసేవ చేసేవారిని అభ్యర్థులుగా ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీ రాములు, మాజీ ఎంపీపీ కొమిరె లక్ష్మయ్య, బీజేపీ మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలి



పీయూలో నిరసన తెలుపుతున్న పీయూ అధ్యాపకులు



జడ్చర్లలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



మహబూబ్‌నగర్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న మాల మహానాడు నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సీజేఐ బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తున్నట్లు పీయూ అధ్యాపకులు పేర్కొన్నారు. పీయూలో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ నాగం కుమారస్వామి మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో న్యాయ వ్యవస్థకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, సీజేఐపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో లా కళాశాల ప్రిన్సిపాల్ మాళవి, రవికాంత్, అధ్యాపకులు భూమయ్య, కృష్ణయ్య, కిషోర్, రాజ్‌కుమార్, జ్ఞానేశ్వర్, రవికుమార్, పర్వతాలు, విజయభాస్కర్ పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: భారత ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి యత్నించిన న్యాయవాది రాకేష్ కిశోర్‌ను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి జంగయ్య మాదిగ డిమాండ్ చేశారు. పట్టణంలోని నేతాజీ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై పరుశ పదజాలం వినియోగించిన సహచర మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దానం హరిబాబు, వినోద్‌కుమార్, కరాటే శ్రీను, భీంరాజ్ పాల్గొన్నారు.

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషన్‌రామకృష్ణ గవాయిపై న్యాయవాది రాకేష్ కిషోర్ బూటుతో దాడి చేయడం భారత రాజ్యాంగంపై చేసిన దాడిగా మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానుగడ్డ యాదయ్య అన్నారు. మాల మహానాడు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి ఎద్ల కృష్ణయ్య, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, వెంకటరాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దేవరకద్ర: ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి దేశం తలదించుకునే చర్య అని ఎఫ్ఏఫ్‌ఏడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు భార్గవి బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చిన్నచింతకుంట: గవాయ్‌పై దాడి హేమమైన చర్య అని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు జి.భార్గవి అన్నారు. ఆమె విలేకర్లతో మాట్లాడుతూ సనాతన ధర్మం ముసుగులో న్యాయ మూర్తి బీఆర్ గవా య్‌పై జరిగిన మనువాద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి

దేవరకద్ర: స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని బీజేపీ స్థానిక సంస్థల ఇన్‌చార్జి యజ్ఞభూపాల్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని జీనుగరాల, బస్వాయపల్లి గ్రామాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణంరాజు ఉన్నారు.

వృద్ధుల సంరక్షణకు చట్టాలున్నాయి



నవాబుపేట: వృద్ధుల సంరక్షణకు చాలా చట్టాలున్నాయని, వాటిని అందరు అవగాహన చేసుకోవాలని సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణం తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో సీనియర్ సిటీజన్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృద్ధుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. వృద్ధుల సంరక్షణ వారి పిల్లల బాధ్యత అని, దాన్ని విస్మరిస్తే చట్టపరంగా శిక్షార్హులన్నారు. 2007 చట్టం ప్రకారం తమ తల్లిదండ్రులను వారి పిల్లలు సంరక్షించని పరిస్థితిలో వారు తమ ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకునే హక్కు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఫోరం మండల అధ్యక్షుడు నర్సింహులు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరప్ప, ఎల్లప్ప కూచూర్ స్వామి, పండారినాథ్, సత్యనారాయణ, రత్నయ్య, వేణునాథం ఉన్నారు.

ఫోటో08జడ్‌సీఎల్407: నవాబుపేటలో వృద్ధులను సన్మానిస్తున్న ఫోరం నాయకులు

పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలు ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌లో దొరతనం రోజురోజుకు పెరుగుతుందని, మాదిగలను దూషించే పరిస్థితి వచ్చిందంటే ఆయన మనసిక పరిస్థితి సరిగ్గాలేదని ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కమలాకర్ మాదిగ పేర్కొన్నారు. మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తూ పీయూ మెయిన్ గేట్ వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మంత్రి లక్ష్మణ్‌పై చేసిన వాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీను, నాగేంద్ర, రాజశేఖర్, యశ్వంత్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం



బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మూసాపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన తుంకినీపూర్ మాజీ సర్పంచ్ బుచ్చన్నగౌడ్‌తో పాటు దాసర్‌పల్లి, నిజాలాపూర్ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఓటు చోరీకి సంబంధించిన సంతకాల సేకరణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ నేత హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, నాయకులు ఉన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



సామూహిక సీమంతం నిర్వహిస్తున్న అధికారులు

జడ్చర్ల టౌన్: సరైన పోషకాహారం తీసుకోవటం ద్వారానే ఆరోగ్యం బాగుంటుందని, అప్పుడే ఆరోగ్య రాష్ట్రంగా మార్చగలుగుతామని డీడబ్ల్యూఓ జరీనాబేగం అన్నారు. పోషణమాసం పురస్కరించుకుని మండల పరిషత్ సమావేశ మందిరంలో జడ్చర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆరోగ్యకరమైన మహిళ శక్తివంతమైన కుటుంబానికి పునాదిగా మారుతుందన్నారు. సమాజంలో అధికంగా వేధిస్తున్న ఆరోగ్యసమస్యల్లో ముఖ్యమైన స్థూలకాయం సమస్య నివారణకు పంచదార, ఉప్పు, నూనెలు తగ్గించాలన్నారు. పోషణతో పాటు విద్య అవసరమని, ప్రతి ఒక్కరు తమ పిల్లలను తప్పనిసరిగా చదివించాలని పిలుపునిచ్చారు. పోషణ సంరక్షణలో పురుషుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమన్నారు. స్థానికంగా లభించే ఆహార ఉత్పత్తులను తీసుకోవటం ద్వారా గ్రామీణ ప్రజలకు బలమైన పునాదిగా మారుతుందన్నారు. పోషకాహారం గూర్చి సామాజిక మాధ్యమాలు, డిజిటలైజేషన్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ శోభారాణి, అర్బన్‌హెల్త్ సెంటర్ డా.మనుప్రియ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీడీఓ కరుణశ్రీ సూచించారు. మహబూబ్‌నగర్ మండలంలోని రామచంద్రాపూర్‌లో పోషణ మాసోత్సవం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడబ్ల్యూ జరీనాబేగం, రూరల్ సీడీపీఓ శైలజశ్రీ, ఎంఈఓ కృష్ణయ్య, మెడికల్ ఆఫీసర్లు శరత్‌చంద్ర, నరేష్ పాల్గొన్నారు.

చిన్నారుల తల్లులతో ప్రతిజ్ఞ

పోషణ మాసోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక లక్ష్మీనగర్‌కాలనీ, లెప్రసీ కాలనీల లోని అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో ఐసీడీఎస్ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వసీం సుల్తానా, ఏడబ్ల్యూటీఎస్‌లు స్వప్న, ఇందిర పాల్గొన్నారు.

కొత్త సంఘాల ఏర్పాటు వేగవంతం చేయాలి



మహిళా సంఘాల సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నర్సింహులు

గండేడ్: మండలంలో కొత్తగా వికలాంగులు, వృద్ధుల సంఘాల ఏర్పాటు వేగవంతం చేయాలని డీఆర్‌డీఓ నర్సింహులు పేర్కొన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో రూర్బన్ పనులను పరిశీలించారు. ఉపాధి హామీ, మహిళా సమాఖ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. గ్రామాల్లో కొత్త సంఘాలు ఎక్కువ మొత్తంలో ఏర్పాటు చేయాలన్నారు. సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులు ఎన్ని ఉన్నాయి, రుణాల లక్ష్యం ఎంత మేర ఇచ్చారని ఏపీఎం రజితను అడిగి తెలుసుకున్నారు. ఈ సంవత్సరం రూ.24 కోట్ల రుణాల లక్ష్యం కాగా, ఇంకా రూ.11కోట్ల రుణం పంపిణీ చేయాల్సి ఉందని ఏపీఎం తెలిపారు. సంఘాల ఆన్‌లైన్ ప్రక్రియ వెంట వెంటనే పూర్తి చేయాలని అని సూచించారు. ఉపాధి హామీ పనుల ప్రగతిపై ఏపీఓ హరిశ్చంద్రుడిని అడిగి తెలుసుకున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు లేని చోట పంచాయతీ కార్యదర్శులతో జాబ్‌కార్డుల అప్‌డేట్ త్వరితగతిన చేయించాలని ఆయన సూచించారు. ఎన్నికల పనులపై ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డిని పలు విషయాలు డీఆర్‌డీఓ నర్సింహులు అడిగి తెలుసుకున్నారు.

ఎస్‌ఎంవీ ఆస్పత్రి ఉచిత వైద్య శిబిరం

పాలమూరు: హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రి, పట్టణంలోని ఎస్‌ఎంవీ మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో బుధవారం ఎస్‌ఎంవీ ఆస్పత్రిలో మూర్చ వ్యాధి, వెన్నెముక(న్యూరో సర్జరీ మెడికల్ న్యూరో)పై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూరో సర్జన్ రఘు సామల, డాక్టర్ వంశీకృష్ణ వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, ఆర్థో, గైనిక్, న్యూరో సైన్స్ విభాగాల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఎండీ డాక్టర్ రమేష్‌గౌడ్, వైద్యులు కార్తీక్, రాజేష్ పాల్గొన్నారు.

చిన్నపిల్లల గుండె సమస్యలపై వైద్య శిబిరం

సత్యసాయి సుజలా ప్రవంతి ట్రస్ట్ సిద్దిపేట ఆధ్వర్యంలో ఈనెల 10న ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చిన్నపిల్లల గుండె సంబంధిత వ్యాధులపై ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల గుండె సంబంధిత సమస్యలను గుర్తించి సదరు చిన్నారులకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. ఆపరేషన్ కోసం ఎంపిక చేసిన చిన్నారులకు సత్యసాయి సంజీవని ఆస్పత్రిలో చేయడం జరుగుతుందని, మందులు సైతం ఉచితంగా ఇస్తారని తెలిపారు. జిల్లాలో గుండె సంబంధిత సమస్యతో ఇబ్బంది పడుతున్న తల్లిదండ్రులు వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రహదారులే ఆర్టీసీ బస్‌స్టాప్‌లు



నంచర్లగేట్ దగ్గర బస్టాండ్‌లోకి వెళ్లకుండా రోడ్డుపైనే నిలిపిన బస్సు

మహమ్మదాబాద్: ఆర్టీసీ బస్సులు నిలిపేందుకు ప్రభుత్వం నుంచి ఆర్టీసీ సంస్థ రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్లు నిరుపయోగంగా ఉంటున్నాయి. డ్రైవర్ల నిర్లక్ష్యంతో ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులు నిలుపకుండా రోడ్డుపైనే నిలిపి వెళ్తున్నారు. మండలంలోని నంచర్లగేట్(దేశాయిపల్లి) క్రాస్‌రోడ్డు దగ్గర నలువైపులా వచ్చే ప్రయాణికుల కోసం రద్దీ ఎక్కువగా ఉండటంతో పెద్ద ఆర్టీసీ బస్టాండ్ నిర్మించారు. కొన్ని రోజులు ఆర్టీసీ సిబ్బందిని కూడా ఏర్పాటు చేసి ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. రెండేళ్లుగా సిబ్బంది లేకపోవడంతో బస్సులు లోపలికి వెళ్లి అక్కడ పెట్టిన రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లేవారు. కానీ ప్రస్తుతం డ్రైవర్లు బస్టాండ్‌లోకి వెళ్లకుండా రోడ్డుపై నిలపడంతో ఎంతో మంది ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఇటీవల రోడ్డు వెడల్పు చేయడంతో సర్వీసు రోడ్డుపై కాకుండా ప్రధాన రోడ్డుపైనే నిలపడంతో ప్రయాణికులు ఉరుకుల, పరుగులతో వెళ్లి బస్సు ఎక్కాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు గమనించి ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోకి పంపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

భారీ వర్షం.. ఇళ్లలోకి చేరిన నీరు

నవాబుపేట: మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో వర్షం నీరు ఇళ్లలోకి చేరింది. ఈ సందర్భంగా మండలంలోని ఇప్పటూర్, రుద్రారం గ్రామాల్లో వర్షం నీరు ఇళ్లలోకి వచ్చింది. కాలువలు, కుంటలు పొంగిపొర్లాయి.



మట్టి తరలిస్తున్న వాహనం పట్టివేత



చిన్నచింతకుంట: మండలంలోని పల్లమరి గ్రామ సమీపంలో ఎర్రగుట్ట నుంచి మంగళవారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన వడ్ల అనిల్‌చారి, మరికల్ గ్రామానికి చెందిన చిన్న లక్ష్మయ్య భారత్ బెంజ్ వాహనాల ద్వారా అక్రమంగా మట్టిని తరలిస్తుండ గా పోలీసులు పట్టుకున్నారు. వాహనాలు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనాలను ఎస్‌ఐ ఓబుల్‌రెడ్డి బుధవారం తహసీల్దార్ ఎల్లయ్యకు అప్పగించారు. అక్రమ మట్టి తరలింపుపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అక్రమంగా మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.